# ప్రవాసాంధ్ర సాంస్కృతిక రంగంలో  సంచలనం – సిలికానాంధ్ర

ప్రారంభమైన అతి కొద్ది సమయంలోనే ప్రపంచవ్యాప్తంగా పేరుతెచ్చుకున్న ప్రవాసాంధ్ర సంస్థ సిలికానాంధ్ర. సిలికానాంధ్ర కార్యక్రమాలు చూసినవారందరూ ఈ సంస్థని 'ప్రవాసాంధ్ర' సంస్థ అనేకంటే 'ప్రభాసాంధ్ర' సంస్థ అనడం సమంజసంగా  ఉంటుంది అంటుంటారు. ప్రవాసాంధ్ర సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణలో, ఎన్నో దశబ్దాలుగా పేరుకుపోయిన నమ్మకాల్ని పటాపంచలు చేసి, అమెరికాలోని సిలికాన్ వేలీ నడిబొడ్డు మీద అచ్చతెలుగు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఔరా అనిపించుకుంటున్న సిలికానాంధ్ర సంస్థ గురించి,  ఆ సంస్థ సాధించిన విజయాల గురించీ, విజయాల వెనుకనున్న నేపథ్య కథనాల గురించీ సంక్షిప్త వ్యాసం..

తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ  స్ఫూర్తి అనేది సిలికానాంధ్ర నినాదం. ఈ స్ఫూర్తితో అచ్చ తెలుగు కార్యక్రమాలు, తెలుగులోనే నిర్వహించడం సిలికానాంధ్ర ఆశయం. సిలికానాంధ్ర, పేరుకి ప్రవాసాంధ్ర సాంస్కృతిక సంస్థే కానీ నిజానికి సిలికానాంధ్ర 'జగమంత కుటుంబం' అంటారు స్థాపక అధ్యక్షులు శ్రీ కూచిభొట్ల ఆనంద్.

<u>నాంది:</u> 2001 అగస్ట్‌లో అమెరికా వచ్చిన శ్రీ గరికపాటి నరసింహారావు గారు, వేరే నగరాల్లో కూడా అవధానం చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారని సిలికాన్ వేలీ లో ఉన్న చెరుకుపల్లి శ్రీనివాస్ గారికి వర్తమానం అందింది. ఆయన మిత్రుడు కూచిభొట్ల ఆనంద్‌ని సంప్రదించారు. అంతకుముందే తానా సభల్లో గరికపాటి గారి కార్యక్రమాన్ని చూసిన ఆనంద్ , ఆ  మహా పండితుడి కార్యక్రమం జరగవలసిన తీరు అలా కాదని అప్పటికే అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి సాహితీ కార్యక్రమాలు ఎలా నిర్వహించవచ్చునో మనమే ఒక సారి చేసి చూపిద్దాం అనుకున్నారు. ఐతే ఈ కార్యక్రమం కోసే చేసే ప్రయత్నాలని కేవలం ఈ కార్యక్రమం తోనే ఆపకుండా, మరింత ముందుకి సాగాలన్న ఉద్దేశ్యంతో ఒక తెలుగు సాంస్కృతిక సంస్థని




ప్రారంభించాలని నిర్ణయించుకుని, ఆసక్తి గల కొంతమంది మిత్రుల్ని సమకూర్చుకుని 'సిలికానాంధ్ర' అన్న పేరుని ఖాయం చేశారు. అప్పటివరకూ ఉన్న కొన్ని నమ్మకాలు ..'' అమెరికాలో తెలుగు కార్యక్రమాలైనా ఇంగ్లీషులోనే కామెంటరీ ఉండాలి. లేకపోతే ఎవరికీ అర్ధం కాదు, సినిమా ఆధారిత డాన్సులు లాంటి కార్యక్రమాలకైతేనే ఎక్కువమంది ప్రేక్షకులొస్తారు, ఇలాంటి అవధానాలకి పాతిక, యాభై మంది మించి ప్రేక్షకులు రారు..'' వగైరా..వగైరా. ఈ నమ్మకాలని

సమూలంగా మార్చేసి తెలుగు కార్యక్రమాన్ని పూర్తిగా తెలుగు లోనే నిర్వహించి చూపించాలని నిర్ణయించారు. కార్యక్రమానికి ఏర్పాట్లన్నీ, పూర్తిగా ఒక ప్రణాళిక ప్రకారం 'ప్రోజెక్ట్ ప్లాన్' వేసుకుని , పూర్తిచేశారు. అగస్ట్4, 2001..లివర్ మోర్ దేవాలయం. సిలికాన్ వేలీ కేంద్రానికి ఈ దేవాలయం దాదాపు 50 మైళ్ళ దూరంలో ఉంటుంది. సాయంకాలం 5.00 గంటలకి కార్యక్రమం మొదలవ్వాలి..ఏర్పాట్లన్ని ముందే పకడ్బందీగా పూర్తవడం వల్ల సరిగ్గా 5.00 గంటలకి వేదపఠనం, పూర్ణ కుంభస్వాగతంతో అవధాని గారిని వేదిక మీదికి తీసుకురావడం జరిగింది. ఇంకా వేదిక మీద ఉద్దండపండితులైన శ్రీ ఏలూరిపాటి అనంత రామయ్య గారు, శ్రీ ప్రసాదరాయ కులపతిగారు,శ్రీ కాశీనాధుని మహేశ్వర ప్రసాద్ గారు..ప్రభృతులు ఆసీనులయ్యారు. దాదాపు 800 మందికి స్థానంగల హాల్లో 5.00 గంటలకి కేవలం 150 మంది ఉన్నారు..సభ ప్రారంభమైంది..5.10 కి 300 మంది వచ్చారు..5.25 కి 700 మంది ఉన్నారు. 5.30 తరువాత హాలు పూర్తిగా నిండిపోయి, బయటచాలామంది నిలబడ్డారు. ఆ విధంగా అవధానం దాదాపు మూడున్నర గంటలు కొనసాగింది.. అది ..ప్రవాసాంధ్ర సాంస్కృతిక చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలికిన రోజు..! తరువాత సిలికానాంధ్ర ఇంక వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం రాలేదు.

<u>**కొత్తదనం - తెలుగు ధనం:**</u> 'సంప్రదాయ స్ఫూర్తి' అన్న మాటకి నిజమైన నిదర్శనంగా సిలికానాంధ్ర కార్యకర్తలు మొట్టమొదటి కార్యక్రమంనుంచే పంచె, లాల్చీ, పై కండువా తోనే ప్రతికార్యక్రమ నిర్వహణలోనూ పాల్గొంటారు. ఏ కార్యక్రమమైనా మొదటి నుంచీ చివరి వరకూ పూర్తిగా తెలుగు వ్యాఖ్యానంతోనే సాగుతుంది. అత్యవసరమైతే తప్ప అస్సలు ఆంగ్లపదాలని ఉపయోగించరు. మొట్ట మొదట్లో కొంతమంది ' ఈ తరం పిల్లలకి అర్థం కావడానికి కొంచెం ఇంగ్లీషులో కూడా చెప్పండి " అనేవారు కానీ ఇప్పుడైతే .."మీరు తెలుగులోనే కొనసాగించండి..మాకు ఎంతో వినసొంపుగా వుంటోంది. మా పిల్లలకి కూడా వాటికి అర్థం చెప్పి, వాళ్ళూ నేర్చుకునేలా చేస్తాము." అంటున్నారు. ప్రచారానికి ఉపయోగించే కరపత్రాలు , వెబ్ సైట్ లో ముఖ్యమైన సమాచారం అన్నీ కూడా తెలుగు లోనే ఉంటాయి.




<u>**సినీగీతాల , సినీ నృత్యాలనుంచీ విముక్తి:**</u> ముందు చెప్పినట్లే సినిమా పాటలు ఉంటే తప్ప అమెరికాలో తెలుగు వారు కార్యక్రమాలు చూడరు అన్న

అపప్రధని సమూలంగా తుడిచిపెట్టింది సిలికానాంధ్ర. మొట్టమొదటి కార్యక్రమం నుంచీ ఏ కార్యక్రమంలోనూ సినిమాపాటల అధారిత కార్యక్రమాలు కానీ, సినిమా నృత్యాల వాసనలు కానీ అస్సలు దగ్గరకి రానివ్వలేదు. కేవలం తెలుగు కళారూపాలతో రూపొందించిన ఎనిమిది గంటల నిర్విరామ సాంస్కృతిక కార్యక్రమాలని ప్రతి యేడాదీ ంధ్ర సాంస్కృతికోత్సవం పేరుతో భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు.

<u>ప్రయోగాల పుట్టినిల్లు:</u> నిజానికి చెప్పాలంటే సిలికానాంధ్ర చేపట్టిన ప్రతి కార్యక్రమం ప్రవాసాంధ్ర సాంస్కృతిక చరిత్రలో ఒక రికార్డే..! 2001 డిసెంబర్ లో మొట్టమొదటిసారిగా ఆంధ్ర సాంస్కృతికోత్సవం పేరుతో మధ్యాహ్నం 1.00 నుంచీ రాత్రి 10.00 వరకూ కేవలం తెలుగు కళారూపాలతో రూపొందించిన కార్యక్రమాన్ని 1200 మంది ప్రేక్షకులు తిలకించారు. 2002 మార్చిలో మొట్టమొదటిసారిగా అమెరికా పశ్చిమతీరంలో వెయ్యిమంది ప్రేక్షకుల సమక్షంలో మూడున్నరగంటల పాటు కవిసమ్మేళనాన్ని నిర్వహించారు. 2002 జూన్ లో నాలుగ్గంటలపాటు కేవలం హాస్యభరిత కార్యక్రమాలతో 'హాస్యవల్లరి' ని రూపొందించారు. 2003 లో తెలుగులో మొట్టమొదటిసారి హాస్యకవిసమ్మేళనాన్ని నిర్వహించారు. 2003 అగస్ట్‌లో మొట్టమొదటి సారిగా పూర్తి నిడివి పద్యనాటకాన్ని ఏర్పాటు చేశారు. 2004 మే నెలలో ఆంధ్రకుటుంబశిబిరం పేరుతో అమెరికా కొండల్లో తెలుగుగ్రామీణవాతావరణాన్ని సృష్టించి 400 మందితో 3 రోజులపాటు ఫేమిలీ క్యాంప్ నిర్వహించారు. ఈ కాంప్‌లోనే అర్ధరాత్రి కొండచరియలమీద హై పవర్ లైట్లు, సౌండ్ సిస్టమ్స్ ని ఉపయోగించి, కళాకారుల్ని కొండచరియలమీదికి తీసుకెళ్ళి అల్లూరి సీతారామరాజు లైవ్ నాటికని ప్రదర్శించారు.2004 అగస్ట్‌లో ముందుగా అనుకున్న పద్యనాటకం వీలుకానప్పుడు, స్థానిక కళాకారులతో, శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వంలో కేవలం రెండు వారాల్లో మూడు గంటల 'శ్రీ కృష్ణ రాయబారం' పూర్తిస్థాయి పద్యనాటకాన్ని ప్రదర్శించి చరిత్ర సృష్టించారు సిలికానాంధ్ర కార్యకర్తలు. 2004 ఆంధ్ర సాంస్కృతికోత్సవంలో 'సిలికాన పల్లి తిరణాల' పేరుతో, మూడు గంటల పాటు, పూర్తి తెలుగు పల్లెటూరి జాతర వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా మోడల్ రైల్వేస్టేషన్ ని కూడా నిర్మించడం ఒక ప్రధానాంశం. 2005 జనవరిలో 12 గంటలపాటు నిర్విరామం గా 250 మంది కళాకారులతో 'అన్నమాచార్య సంకీర్తనోత్సవాన్ని' నిర్వహించారు. సిలికానాంధ్ర నిర్వహించే ఏ కార్యక్రమానికైనా 1000 మందికి తక్కువకాకుండా అభిమానులు హాజరౌతుంటారు. ఆంధ్ర సాంస్కృతికోత్సవానికి హాజరయ్యే ప్రేక్షకుల సంఖ్య 2,500 పై మాటే..!

<u>ఆత్మీయ ఆహ్వానాలు:</u> సిలికానాంధ్ర మొట్టమొదటి రోజునుంచీ కూడా వ్యక్తిగత పరిచయాలకి, వ్యక్తిగత ఆహ్వానాలకీ పెద్దపీట వేస్తుంది. ఎక్కడా కరపత్రాలని వొదిలి, ఎవరో ఒకరు తీసుకుంటార్లే అని వూరుకోరు. ప్రతి కార్యక్రమానికీ, చక్కటి తెలుగులో అందంగా డిజైన్ చేసి ముద్రించిన కరపత్రాలని, సిలికానాంధ్ర కార్యకర్తలు తెలుగు వారు ఎక్కువగా వచ్చే షాపుల వద్ద

నించొని, ప్రతివారినీ పలకరించి , కార్యక్రమం గురించి వివరించి, ఆహ్వానిస్తారు. ఆంధ్ర సాంస్కృతికోత్సవం లాంటి భారీ కార్యక్రమాలకైతే తెలుగు వారి ఎక్కువగా వున్న ప్రదేశాలని ఎన్నుకుని వీలైనంతమంది తెలుగు వారి ఇళ్ళకు వెళ్ళి బొట్టు పెట్టి మరీ, కార్యక్రమానికి రమ్మని అహ్వానిస్తారు. కార్యక్రమానికి హాజరైన ప్రేక్షకులనందరినీ సంప్రదాయ దుస్తులు ధరించిన సిలికానాంధ్ర కార్యకర్తలు పన్నీరు జల్లి (ఆడవారికి బొట్టుపెట్టి) సంప్రదాయ సిద్ధంగా, చిరునవ్వుతో ఆహ్వానిస్తారు.



<u>ప్రతిపనీ ప్రణాళికా బద్ధం – ప్రచారమూ ఒక ఆయుధం:</u> సిలికానాంధ్ర చేపట్టే ప్రతి కార్యక్రమానికీ ఒక క్రమబద్ధమైన ప్రణాళిక ఉంటుంది. సిలికాన్ వేలీ లోని హైటెక్ కంపెనీల్లో పనిచేసే సిలికానాంధ్ర కార్యకర్తలు, తాము ఉద్యోగాల్లో ఉపయోగించే ప్రోజెక్ట్ప్లానింగ్ లాంటి విధానాలన్నింటినీ సిలికానాంధ్ర కార్యక్రమాలకి కూడా అనువర్తింపచేస్తారు. ప్రతి కార్యక్రమానికీ 25 పేజీలకి తగ్గకుండా ప్రొడక్షన్ గైడ్ తయారుచేస్తారు. అదే ఆంధ్రసాంస్కృతికోత్సవం లాంటి భారీ కార్యక్రమానికైతే 200 పేజీల గైడు ఉంటుంది. ఈ ప్రొడక్షన్ గైడులో ప్రతి చిన్నవిషయాన్ని సవివరంగా వ్రాసుకుంటారు. వేదికమీద ఎవరు ఎప్పుడు ఎక్కుతారు , ఏటువైపు నిల్చోవాలి, ఎక్కడ కూర్చోవాలి లాంటి అతి చిన్న అంశాలు కూడ వివరంగా ఉంటాయి. ఇలా చేయడం వల్లనే, చేసేవి ఎంత సంక్లిష్టమైన కార్యక్రమాలైనా, అన్నీ సజావుగా ఖచ్చితంగా అనుకున్న విధంగానే జరుగుతాయి. అలానే సిలికానాంధ్రలో ప్రతి విభాగాంలోనూ అనుభవజ్ఞులైన , అంకిత భావం కల కార్యకర్తలు ఉన్నారు. ఆడియో, వీడియో, వెబ్ డిజైనింగ్, వంటలు చేయడం, ఈవెంట్ మేనేజ్ మెంట్, ఫండ్ రైజింగ్, ..లాంటి అన్ని విభాగాలు అతి సమర్ధవంతంగా పనిచేస్తుంటాయి. ప్రచారం విషయానికివస్తే, సిలికానాంధ్ర ఈ కోణంలో కూడా అనేక కొత్త పుంతలు తొక్కింది. ప్రతి కార్యక్రమానికి ముందే అన్ని పత్రికలకీ 'కర్టెన్ రైజర్స్' విడుదల చేయడం, కార్యక్రమం ముగిసిన కొద్ది గంటల్లోనే అన్ని పత్రికలకీ వార్తలు పంపించడం, మరునాడే వెబ్ సైట్ లో సచిత్రకధనాలు, వీడియోలూ అప్ లోడ్ చేయడం.. లాంటి ప్రక్రియలన్నీ సిలికానాంధ్ర ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందడానికి సహకరిస్తున్నాయి.

<u>వెబ్సైట్:</u> సిలికానాంధ్ర వెబ్సైట్ మొదటినుంచీ ప్రవాసాంధ్రులనందరినీ విశేషంగా ఆకర్షిస్తోంది. వీలైనంత వరకూ తెలుగులోనే విశేషాలని పొందుపరచడానికి మొదటినుంచీ సిలికానాంధ్ర వెబ్

సైట్ ప్రాధాన్యతనిస్తోంది. క్రమం తప్పకుండా వెబ్ సైట్ లోని విశేషాలని ఎప్పటికప్పుడు తాజాగా ఉంచడం వల్ల, వాణిజ్య పత్రికల స్థాయికి దీటుగా సిలికానాంధ్ర వెబ్‌సైట్ కి పేజ్ హిట్స్ వస్తున్నాయి. అనేక విభాగాలతో, దాదాపు 15 గంటల ఆడియో, వీడియో విశేషాలతో నిత్యనూతనంగా ప్రవాసాంధ్రుల్ని అలరిస్తోంది www.siliconandhra.org

__సుజనరంజని:__ తాను నిర్వహించే కార్యక్రమాల స్ఫూర్తిలో ఒక అంశమైన 'సాహితి' అన్న పదానికి నూటికి నూరు శాతం న్యాయం చేకూరుస్తూ, సిలికానాంధ్ర 'సుజనరంజని' పేరుతో అనేక పుస్తకాలని ప్రచురించింది. మూడు ఉగాది ప్రత్యేక కవిత / గేయ సంకలనాలు, నాలుగు ఆంధ్ర సాంస్కృతికోత్సవ ప్రత్యేక సంచికలూ, ఒక కార్టూన్ సంకలనం ..ప్రచురించబడ్డాయి. బాపు, బాలి, కరుణాకర్, చంద్ర..లాంటి ప్రసిద్ధ చిత్రకారులంతా 'సుజనరంజని' కి ముఖచిత్రాలు తీర్చి దిద్దారు. ఈ ప్రచురణలన్నింటినీ ఆయా కార్యక్రమాలకి హాజరైన వారందరికీ ఉచితంగా ఇవ్వడం జరిగింది. జనవరి 2004 నుంచీ సిలికానాంధ్ర సాహితీ సేవలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. అదే, మొట్టమొదటి మల్టీమీడియా తెలుగు వెబ్ మాగజైన్ 'సిలికానాంధ్ర' మాసపత్రిక. వెబ్ పత్రికగా వెలువడుతున్న 'సుజనరంజని' నెల నెలకీ పాఠకుల సంఖ్యని పెంచుకుంటూ విజయపథంలో ముందుకి సాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు రచయిత / త్రు లెందరో ఈ 'సుజనరంజని' ని తమ రచనలతో సుసంపన్నం చేస్తున్నారు.

__సాంస్కృతిక సహజీవనం:__ ఆదినుంచీ సహజీవనం, అందరితో సత్సంబంధాలకు అత్యంత ప్రధాన్యతనిస్తున్న సిలికానాంధ్ర, ఇతర ప్రవాసాంధ్ర సాంస్కృతిక సంస్థలతో కలిసి అనేక ఉమ్మడి కార్యక్రమాలు చేపట్టింది. స్థానికంగా వున్న 'కళాలయ' సంస్థతో కలిసి మంగళం పల్లి బాలమురళి గారి శాస్త్రీయ సంగీత కచేరీ, రాధారెడ్డి, రాజా రెడ్డిల నృత్య ప్రదర్శన, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా వారికోసం లాస్‌ఏంజల్స్ లో మూడు దీపావళి సాంస్కృతిక కార్యక్రమాలు, తెలుగు అసోసియేషన్ ఆఫ్ శాక్రిమెంటో కోసం ఒక సంక్రాంతి కార్యక్రమం..నిర్వహించింది సిలికానాంధ్ర. ఇంకా అనేక ఇతర ప్రవాసాంధ్ర సంస్థలకి పరోక్షంగా సహాయ సహకారాలందిస్తోంది సిలికానాంధ్ర.

అనేకానేక ప్రత్యేకతలతో, ప్రతి కార్యక్రమానికీ తాను సృష్టించిన ప్రమాణాలని తానే అధిగమిస్తూ, నిబద్ధత అంకితభావం, దృఢదీక్ష కలిగిన 'సాంస్కృతిక సైనిక బృందం' తో ముందుకి సాగుతున్న సిలికానాంధ్ర రానున్న కాలంలో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.